

# అమరజీవి

ఆర్. సంధ్యాదేవి

డాక్టర్ సుధేష్ణాదేవి పేషంట్లను చూసి వచ్చి కారులో కూర్చుంది అలసటగా. డ్రైవర్ కారు పోనిస్తున్నాడు. గత స్మృతులు కళ్ళకు కట్టినట్టు గుర్తురాగా తనని తాను ఓదార్చుకునే శక్తిని కోల్పోయి నయనాలనుంచి ధారాళంగా వెలువడుతున్న అశ్రుబిందువులు ఆమె చెక్కిళ్ళు తడిపేస్తుంటే బాధాపూరిత హృదయం సుడులు తిరగసాగింది.

ఆమె కనులోయల్లోంచి వెలువడుతున్న కన్నీటిలో ఎన్నో బాధల గాథల ప్రవాహం పొంగి పొరలుతుంది. ఆపుకోలేని కన్నీటి ధారలు కర్చీఫ్‌ని తడిపేశాయి.

ఆమె కర్ణపుటాలకు కెప్టెన్ వినయ్ కృష్ణ కోటికంఠాలతో వెలుగెత్తి పిలిచినట్టయింది.

"సుధీ, సుధీ త్వరగా నా దగ్గరకు వచ్చెయ్. నిన్ను విడిచి నేను ఒక్క క్షణం వుండలేను" అంటున్నాడు.

తను ఇంకా ఎందుకు బ్రతికివుంది?

పచ్చని బ్రతుకు ప్రోడువారిపోయాక కూడా తను ఇంకా జీవించేవుంది.

ఎన్నెన్నో ఆశలతో బంగారు సోపానాలు వేసుకుంది. మధురమైన ఊహలతో అడుగుపెట్టిన తొలిసోపానం ఫెళఫెళమంటూ విరిగిపోయింది. తన జీవితంలో పన్నీరు కురుస్తుంది అని మురిసిపోయిన క్షణంలో ఆ పన్నీరు కన్నీరై కురిసింది.

తన జీవితంలో అకాలమేఘాలు ఎందుకు వ్యాపించాయి?

భగవంతుడు తనకి ఎందుకీ శిక్ష విధించాడు?

తనుచేసిన పాపం ఏమిటి? అనేకానేక ఆలోచనలతో ధారాపాతంగా వస్తున్న కన్నీళ్ళను కర్చీఫ్‌తో వొత్తుకుంది.

ఆనాటి వినయ్‌కృష్ణ మాటలు మర్చిపోగలదా?

సుధేష్ణాదేవి బాధగా కళ్ళు మూసుకుంది.

గతం అంతా ఒక్కసారి కళ్ళముందు వడుచుకుంది.

జగన్నాధంగారు కూతుర్ని పిలిచారు. "అమ్మాయి సుధీ" అంటూ.

"ఏమిటి నాన్నా పిలిచారా?" అంటూ వచ్చింది.

ఆయన రెండు ఫోటోలు కూతురికి ఇస్తూ "ఈ రెండు ఫోటోలు చూసి అందులో నీకు ఎవరు నచ్చారో చెప్పు అమ్మా!" అన్నారు.

సుధేష్ణ మౌనంగా ప్రశ్నార్థకంగా తండ్రివైపు చూసింది.

"ఈ అబ్బాయి డాక్టర్. బెంగుళూరులో వుంటున్నాడు. ఈ అబ్బాయి ఇంజినీర్. హైద్రాబాద్‌లో వుంటున్నాడు" అంటూ ఆ ఫొటోలోవున్న అబ్బాయిల గురించి వివరంగా చెపుతూ ఆ ఇద్దరిలో నీకు ఎవరు నచ్చితే ఆ సంబంధం నిశ్చయిస్తాను" అని అన్నారు.

"నాన్నా!" అయోమయంగా తండ్రి వైపు చూస్తూ అంది.

"ఏమిటమ్మా! నీకు ఇష్టంలేదా?"

సుధేష్ణ తనకు ఇష్టంలేదన్నట్టు తల తిప్పింది.

ఆయన క్షణంసేపు మౌనంగా వుండిపోయి తరువాత చిన్నగా నవ్వేస్తూ "నీకు ఇష్టంలేకపోతేవద్దు వేరేసంబంధం చూస్తాను" అన్నారు.

"నాన్నా" అంటూ ఆగిపోయింది.

కూతురు ఏదో చెప్పబోయి ఆగిపోయినట్టు గ్రహించాడాయన.

"ఏమిటో చెప్పమ్మా" అన్నారు అప్యాయంగా. కూతురు అంటే ఆయనకు పంచప్రాణాలు.

సుధేష్ణ క్షణం తటపటాయించి "వినయ్ అంటే మీ అభిప్రాయం ఏమిటి?" అంది మెల్లగా

"ఏ వినయ్! గంగాధర్ రావు కొడుకా?" అన్నారు అనుమానంగా.

అవునన్నట్టు ఊ ఊ ఊపింది.

జగన్నాధంగారికి మిన్నువిరిగి మీద పడినట్లయింది.

జగన్నాధంగారి స్నేహితుడు గంగాధర్‌రావుగారు. ఆయన కొడుకు వినయ్ కృష్ణ. వినయ్ ఆయనకు బాగా తెలుసు. తండ్రితో తమ యింటికి చాలాసార్లు వచ్చాడు. సుధేష్ణకు వినయ్‌కృష్ణకు బాగా పరిచయం వుంది. ఆ పరిచయం పెళ్ళిదాకా దారితీస్తుంది అని తను ఊహించలేదు. తన కూతురు ఇన్నిరోజులు పెళ్ళి వద్దని వాయిదా వేస్తుంటే కారణం ఊహించలేకపోయారు.

అటు వినయ్‌కి, ఇటు సుధేష్ణకుకూడా వయసు పెద్దదే వుంటుంది.

"సుధీ ఏమిటి నువ్వు మాట్లాడేది?" ఆయన కంఠస్వరం గంభీరంగా మారింది.

"మీరు ఇష్టపడితే మేము ఇద్దరం

వివాహం చేసుకోవా లనుకుంటున్నాం నాన్నా" అంది మెల్లగా

"సుధీ! ఈ పెళ్ళికి నేను అంగీకరించను. నాకు ఇష్టంలేదు."

"నాన్నా!" నిశ్చేష్టురాలై అలా నిలబడిపోయింది.

"సుధీ నువ్వు అతన్ని మర్చిపో. నీకు ఇంతకన్నా మంచి సంబంధం తెచ్చి చేస్తాను."

"అయనకి ఏంతక్కువని కాదంటున్నారు! ఆస్థివుంది, చదువుంది, అందం గుణం వున్నాయి. మనిషికి ఇంతకంటే ఏంకావాలి చెప్పండి నాన్నా?" అంది. అలా అంటున్నప్పుడు అమె కంఠం కొస్త వణికింది. కూతురి మాటలకు అయన గాఢంగా నిట్టూర్చాడు.

"సుధీ అతనికి ఆస్తీ అంతస్తులు లేదని కాదనటంలేదు. మిలట్రీ ఉద్యోగాలు అంటే చావుబ్రతుకులతో పోరాటం. నువ్వు నాకు ఒక్కగానొక్క కూతురివి. మీ అమ్మ పోయినదగ్గరనుంచి నిన్ను పువ్వుల్లో పెట్టి అపురూపంగా పెంచుకుంటున్నాను. నిన్ను చూస్తూచూస్తూ ఆ కెప్టెన్‌కి ఇచ్చి ఎలా చెయ్యను చెప్పు!" అన్నారు ఆయన బాధగా. ఆయన మనసులో సందేహం తెలుసుకున్నాక తేలికయిన మనసుతో నవ్వింది. "నాన్నా! నా నుదుట ఏం వ్రాసివుంటే అదే జరుగుతుంది. మీరు భయపడినట్టు మిలట్రీవాళ్ళకి ఆయుష్షులు తక్కువా వేరే ఉద్యోగస్తులకి ఆయుష్షులుఎక్కువా వుండవు. ఎవరి అదృష్టం ఎంతో అంతే."

"సుధీ నీ పట్టు నీదేగాని నా మాట వినవా?"

"నాన్నా! నేను వివాహం అంటూ చేసుకుంటే ఆయన్నే చేసుకుంటాను లేదా అలా ఉండిపోతాను" అంది కచ్చితంగా.

ఆయన మౌనంగా ఉండిపోయారు.

మర్నాడు సుధేష్ణాదేవి వైజాగ్ ప్రయాణం అయి వెళ్ళిపోయింది. అక్కడ కె.జి.హెచ్.లో ఆమె డాక్టర్.

జగన్నాధంగారు బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. కూతురి మాటల్లో నిజం లేకపోలేదు. అపైె భగవంతుడు వున్నాడు అనుకుంటూ గంగాధరరావుగారితో మాట్లాడడానికి ఊరికి ప్రయాణం అయి వెళ్ళేరు.

* * *

ఆరోజు పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం చదవసాగింది సుధేష్ణ. తండ్రి వ్రాసిన ఆ ఉత్తరం పూర్తిగా చదవగానే శరీరం అంతా పువ్వులా తేలికయింది. మనసు అంతా సంతోషంతో ఉక్కిరిబిక్కిరి కాసాగింది. వినయ్‌కృష్ణకూడా తనని తప్ప ఎవ్వర్నీ వివాహం చేసుకోనని తండ్రితో చెప్పటం ఆయనా ఈయనా ఈ విషయాలు చెప్పుకుని నవ్వుకుని ఒక




నిశ్చయానికి వచ్చి, పెళ్ళికి ముహూర్తం పెట్టించేశాం అని వుంది ఆ ఉత్తరంలో.

సుధేష్ణాదేవి క్షణంసేపు మధురమైన ఊహల్లో తేలిపోయింది.

మర్నాడు వినయ్‌కృష్ణ వద్దనుండి వైర్ వచ్చింది, తను ఆ రోజు వస్తున్నట్టు. ఆమె మనసు గాలిలో దూది పింజంలా తేలిపోతుంది.

అయిదు సంవత్సరాలుగా ఇద్దరి మధ్యా ఉత్తరాలు నడుస్తున్నా అతన్ని చూడబోతున్నాను అనుకుంటె సిగ్గు ముంచుకువచ్చింది.

సుధేష్ణ ముస్తాబు అయి స్టేషన్‌కి వెళ్ళింది.

టైము అవటంతో ట్రైన్ వచ్చి ప్లాట్ ఫారమ్‌మీద ఆగింది.

ఆమెను వెంటనే గుర్తుపట్టిన అతను కంపార్ట్‌మెంట్‌లో నుండి ఒక్క దూకు దూకి సంతోషంతో ఆమె చెయ్యి అందుకున్నాడు "సుధీ" అంటూ. ఒక్క క్షణం ఇద్దరికళ్ళు కలుసుకున్నాయి.

తెల్లగా, సన్నగా, పొడవుగా, నాజూగ్గా, అందంగా, సుందరంగా వుంది. ఉంగరాల జుత్తు, చిన్న జారుముడి మెడమీద వేసుకుంది. వైట్ శారీ, లాంగ్‌హేండ్స్ వైట్ బ్లౌజ్ వేసుకుంది. కళ్ళకు కాటుకరేఖలు దిద్దింది. పెదవులకి లైట్‌గా లిప్‌స్టిక్ వేసుకుంది.నుదుట ఎర్రనిబొట్టు చిన్నది పెట్టుకుంది. మెడలో ఒంటిపేట పొడవుగా ముత్యాల గొలుసు వేసుకుంది. చెవులకి పెద్ద పెద్ద రింగులు పెట్టుకుంది. ఎడంచేతికి వాచి, కుడిచేతికి గాజులు అసలు ఏం వేసుకోలేదు.

ఒక్క క్షణం ఆ అందాలరాశివైపు ముగ్ధుడై చూశాడు.

ఆమెకూడా అలాగే అతనివైపు చూసింది.

అతను బాగా పొడవుగా, ఆరోగ్యంగా, అందంగా హుందాగా వున్నాడు.

అతని శరీరచ్ఛాయ చామనఛాయ అయినా ముఖం ఆకర్షణీయంగా కళకళ లాడుతుంది.

కళ్ళల్లో చురుకుదనం, నవ్వుతున్నట్టుండే పెదవులు, ఒత్తయిన ఉంగరాల జుట్టు, కోరమీసాలు చూస్తూనే ఎవరికి అయినా అతను ఆర్మీ ఆఫీసర్ అని తెలిసిపోతుంది. చాక్‌లెట్ కలర్ పాంట్ గోల్డ్‌కలర్ ఫుల్‌హాండ్స్ షర్ట్ టక్‌చేసుకున్నాడు.

గంభీరంగా దర్జాగా వున్న అతన్ని రెప్పవాల్చకుండా చూసింది అతను చిరునవ్వు నవ్వాడు.

ఒకళ్ళు చూస్తారన్న భయంలేకుండా ఆమె చెయ్యి పట్టుకుని అలాగే నడిచి వెళ్ళి టాక్సీలో కూర్చున్నాడు.

"సుధీ" మృదువుగా పిలిచాడు.

ఆ మృదుమధురమైన పిలుపు ఆమె అంతరాంతరాళను మెత్తగా తాకింది.

"ఊ" అంది చిరునవ్వుతో.

"నేను ఎంత అదృష్టవంతుడ్ని. నీలాంటి విద్యావతి, అందాలరాశి నన్ను కోరి వివాహమాడటం ఓహ్ చాలా అదృష్టం."

కలువరేకులవంటి ఆమె నయనాలు మిలమిలా మెరిశాయి. ఆమె హృదయంలో కోటి కుసుమాలు విరబూశాయి.

"సుధీ పెళ్ళికి మన పెద్దవాళ్ళు ఇంత త్వరగా ఒప్పుకుంటారని అనుకోలేదు."

"నేనూ అనుకోలేదు" అంది చిరునవ్వుతో.

ఇద్దరూ హోటల్ రూమ్ తీసుకుని చాలా సేపు సరదాగా కబుర్లతో కాలక్షేపం చేశారు.

అతను ఆ సాయింత్రం బస్సెక్కి వెళ్ళిపోయాడు.

సుధేష్ణాదేవి పెళ్ళి రెండురోజులు వుంది అనగా యింటికి వెళ్ళింది.


జగన్నాథరావుగారి కూతురి పెళ్ళి భారీ ఎత్తున చెయ్యాలని చాలా డబ్బు ఖర్చుచెయ్యసాగారు. పెళ్ళి పనులు చాలా చురుగ్గా సాగిపోతున్నాయి. మర్నాడు ఉదయం పదకొండు గంటలకు పెళ్ళి. మగపెళ్ళివారు ముందురోజుసాయింత్రం ఏడుగంటలకి వచ్చి విడిదిలో దిగారు.

వినయ్‌కృష్ణ, అతని ఫ్రెండ్స్ కలిసి వేరే కారుతో వస్తున్నారని చెప్పారు.

సుధేష్ణాదేవి ఫ్రెండ్స్ ఆమెను ఆట పట్టించసాగారు.

వారి హాస్యాలతో, నవ్వులతో ఆమె ముఖారవిందం సిగ్గుతో ఎర్రగా కంది పోయింది.

ఆ రాత్రి తీయని ఊహలతో మంచం మీద పడుకుంది. నిద్రపట్టలేదు. తలుపు టకటక కొట్టిన శబ్దం అయింది. హైమ



చూసింది. ఒంటి గంటయింది. ఎవరా అని వెళ్లి తలుపు తెరిచింది.

వినయ్‌కృష్ణ చిర్నవ్వు ముఖంతో గుమ్మం పొడవునా నిలబడి వున్నాడు. ఆమెను చూస్తూనే సంతోషంగా చేతులు చాపాడు.

ఆమె ఆ చేతులలో ఒరిగిపోలేదు. "మీరు ఎప్పుడు వచ్చారు?" అంటూ ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

"ఇప్పుడే" అంటూ లోపలికి వచ్చి తలుపులు మూశాడు.

అతను ఆమె కళ్లలోకి కొద్దిక్షణాలు అలాగే చూశాడు.

"సుధీ నువ్వు అలా దూరంగా వుండ వద్దు. నా దగ్గరగా రా. నిన్ను చూడాలని నా మనసు ఎంత వేగిరపడిందో గానే నీ దగ్గరకు పరుగెత్తుకు వచ్చాను" అంటూ

చేతులు చాపి ఆమెను దగ్గరకు లాక్కు-న్నాడు.

"వినయ్" అంటూ ఆ చేతులలో వాలిపోయి అతని గుండెల్లో తల దాచుకుంది.

అతనిచేయి ఆమె జుత్తుని, చెంపలని నిమరసాగింది.

"సుధీ నన్ను నువ్వు ఇంతగా ప్రేమిస్తున్నావే నేను ఒక వేళ చచ్చిపోతే!"

"వినయ్!"అంటూ వినలేనట్టుగా అతని నోటిదగ్గర చెయ్యి అడ్డుపెట్టింది.

"శుభమా అంటూ పెళ్లి జరుగుతుంటే ఏమిటాశుభం మాటలు" సన్నసన్నగా చివాట్లు వేసింది.

అతను ఆమెను మరింత దగ్గరకు తీసుకుని గాఢంగా నిట్టూర్చాడు.

"వినయ్ మన కలలు నిజం అవుతున్నాయి. ఆ భగవంతుడు మనల్ని చల్లగా చూశాడు."

"భగవంతుడు చల్లగా చూశాడు" అంటూ నవ్వాడు.

"ఏమిటి, ఎందుకలా నవ్వుతున్నారు" అంది.

"ఏమీలేదు సుధీ. నీ పిచ్చి అంతా. జరగవలసివుంటే జరిగి తీరుతుంది. ఆ భగవంతుడి గొప్ప ఏమిటి అని."

ఆమె మాట్లాడలేదు.

"సుధీ కొంచెంమంచినీళ్ళు ఇస్తావా!"

ఆమె మంచినీళ్ళు తెచ్చి అతనికి ఇచ్చింది. ఆ నీళ్ళు అతను తాగేసి ఖాళీ గ్లాసు ఆమెకు ఇస్తూ అన్నాడు.

"అబ్బ! నీళ్ళు ఎంత తియ్యగా ఉన్నాయో!" అన్నాడు.

"నీళ్ళు తియ్యగా వుండటం ఏమిటి!" అంటూ నవ్వింది.

"నీ చేతులతో ఇచ్చిన నీళ్ళు తియ్యగా వుండవూ!" అంటూ నవ్వేశాడు.

"సుధీ అలా కూర్చో" అంటూ ఆమెను మంచంమీద కూర్చోమని ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు.

"సుధీ నాకు ఎప్పుడూ ఇలాగే వుండిపోవాలనిపిస్తుంది. నీకు దూరంగా వుండలేను" అన్నాడు బాధగా.

"వినయ్ ఈ రోజు మీ మాటలు చిత్రంగా వున్నాయి" అంటూ అతని క్రాప్‌లో వేళ్ళుదూర్చి మెల్లగా దువ్వింది,


అతను టైము చూసుకుని "నేను వెళ్లాలి. ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారు. పెళ్లి విడిదింట్లో పడుకుంటాను" అంటూ లేచాడు. అప్పటికి టైము నాలుగు అయింది.

ఆమె లేచి నిలబడింది.

"సుధీ" అంటూ ఆమెను చుట్టేశాడు. ముఖం అంతా ముద్దులతో ముంచెత్తి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాడు క్షణం సేపు.

"వినయ్" అంది మైమరుపుగా.

అతని చేతులు ఆమెను మెల్లగా వదిలేశాయి. కదిలి వెళ్ళలేక వెళ్లాడు. చిరునవ్వుతో అతనివైపు చూసింది.




వినయ్‌కృష్ణ కళ్ళల్లో కాంతిలేదు. ముఖం అంతా పాలిపోయింది. సుధేష్ణ తలుపులుమూసి గడియ వేసుకుంది.

* * *

తెల్లవారింది. ఇంట్లో అంతా కంగారు పడుతున్నారు. సుధేష్ణ గదిలో వుంది. వారి మాటలు అర్థంకావటంలేదు. జగన్నాధంగారు పోలీసులతో మాట్లాడుతున్నారు. ఆయన ఆ కబురు విని తట్టుకోలేనట్టు గుండెలపై చెయ్యివేసి పట్టుకున్నారు. మనిషి క్రుంగిపోయారు. అక్కడ కుర్చీలో అలాగే కూలబడిపోయారు. సుధేష్ణాదేవి గదిలోంచి బయటకు వచ్చింది.

"ఏమిటి నాన్నా ! ఏమైంది ?" అంది కంగారుగా.

పెళ్ళికి వచ్చిన జనం అంతా పోలీసులని చూస్తూనే చుట్టూ మూగిపోయారు.

జగన్నాధంగారు కూతురివైపు మతిపోయినట్టు చూశారు సమాధానం చెప్పలేక.

"ఏమైంది నాన్న !" అడిగింది ఆతృతగా, గాభరాగా.

ఆయనికి బదులు పోలీస్ ఆఫీసర్ చెప్పాడు.

"రాత్రి పదకొండు గంటకి ఇక్కడికి నాలుగు మైళ్ళ దూరంలో కారు యాక్సిడెంట్ అయింది."

"అయితే !" అరిచింది అర్థంకానట్టు నుదురు చిట్లిస్తూ.

"ఆ కారులో కెప్టెన్ వినయ్‌కృష్ణ వున్నారు. వారితోపాటు మరో ముగ్గురు

వున్నారు. వారిలో ఇద్దరికి బాగా దెబ్బలు తగిలాయి. మరొకతను కొనఊపిరితో ఉన్నాడు. కెప్టెన్ వినయ్‌కృష్ణ అక్కడికి కక్కడే మరణించారు" అని చెప్పాడు పోలీస్ ఆఫీసర్.

"వాట్ యు ఆర్ సేయింగ్! ఐ కాంట్ బిలీవ్ ఇట్" ఆమె ముఖం కోపంతో ఎఱుపురంగుకి మారింది. కంఠ స్వరం ఖంగ్ మంది.

"డాక్టర్!" అన్నాడు అతను.

"రాత్రి ఆయన యింటికి వచ్చారు. కావలిస్తే ఆ గదిలోకి వెళ్ళి చూడండి" అంది కోపంగా.

పోలీస్ ఆఫీసర్ వెర్రిగా, అయోమయంగా చూస్తూ అన్నాడు. "ఐ యామ్ వెరీ సారీ డాక్టర్" అంటూ కెప్టెన్ వినయ్‌కృష్ణ జేబులో వున్న పర్సు, కాగితాలు తీసి చూపించాడు.

సుధేష్ణాదేవి విడిదింట్లో అతని గదిలోకి వెళ్ళి చూసింది. అతని మంచం ఖాళీగా వుంది.

సుధేష్ణాదేవికి ప్రపంచం అంతా గిర్రున తిరిగిపోయింది. సప్తసముద్రాలు ఏకమై ప్రపంచాన్నే ముంచివేసినట్టు అయింది.

రాత్రి తన గదిలోకి వచ్చింది అతని ఆత్మ!

అంతే కెవ్వున కేక వేసి పడిపోయింది. ఆతరువాత సంవత్సరాలుగడుస్తున్నాయి. ఇహలోకపు చింతలు, సమస్యలు విస్మరించి శాశ్వతంగా ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయిన గుర్తుగా తను మిగిలిపోయింది. నుదుటి కుంకుమ చెరిపేసుకుని ఆరని జ్వాలలు హృదయాన్ని దహించేస్తుంటే, శిలలా బ్రతుకును ఈడుస్తూ నిరాశతో రోజురోజుకి కృంగిపోతూ అతని పిలుపుకై ఎదురుచూస్తూ రోజులు గడుపుతుంది డాక్టర్ సుధేష్ణాదేవి.

ఇంటిముందు కారు ఆగింది. అప్పటికీ ఆమె కారు దిగకపోవడం చూసి "అమ్మాయిల్లు వచ్చింది" అన్నాడు డ్రైవర్ నెమ్మదిగా. అంతా గుర్తుకు వచ్చినప్పుడు కన్నీరు మున్నీరుగా విలపించటం ఆమెకు అలవాటైపోయింది డ్రైవర్ పిలుపుతో ఉలిక్కిపడి "ఆ" అంటూ కళ్ళు తుడుచుకుని చేతిమీద కోటుతో స్టెతస్కోప్ పట్టుకుని కారులోనుంచి దిగింది. సుధేష్ణాదేవి.